APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ బుధవారం 17, జూన్ 2026 సంపుటి: 01 సంచిక :21 పేజీలు : 04 వెల: 2-00/-

## ట్రంప్‌ను అర్థం చేసుకునేందుకు సైకాలజిస్టుల సాయం తీసుకున్న



- శాంతి చర్చల్లో ఆసక్తికర వ్యూహం
- ట్రంప్ ప్రవర్తనపై ప్రత్యేక అధ్యయనం
- స్విట్జర్లాండ్‌లో ఒప్పందానికి సంతకాలు

టెహ్రాన్/వాషింగ్టన్, జూన్ 16 : పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలకడానికి జరిగిన శాంతి చర్చల సందర్భంగా ఇరాన్

2లో



## ఎస్ఐఆర్‌పై బీఎల్ఏలకు అవగాహన శిక్షణ

- సంగారెడ్డిలో శిక్షణ శిబిరం నిర్వహణ
- ఓటరు జాబితా సవరణపై సూచనలు
- ప్రతి కార్యకర్తకు అవగాహన అవసరం

సంగారెడ్డి, జూన్ 16 : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) పూర్తి అవగాహన కలిగి ఉండాలనిరాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో నిర్వహించిన బీఎల్ఏల అవగాహన, శిక్షణ శిబిరంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ

## పరీక్షల అక్రమాలపై కేంద్రాన్ని నిలదీసిన ఖర్గే



2వ పేజీలో

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్
- జవాబుదారీతనంలో మోదీ సర్కార్ విఫలమైందని విమర్శ
- పేపర్ లీకేజీలతో కోట్లాది యువత భవిష్యత్తు ప్రమాదంలోనని ఆందోళన

న్యూఢిల్లీ, జూన్ 16 : దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో

## రాయన పాడు శాటిలైట్ రైల్వే స్టేషన్ ను సందర్శించిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, బీజేపీ అధ్యక్షుడు పీ వీ ఎన్ మాధవ్, బిపశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి



రాయనపాడు : ప్రహ్లాద్ జోషి, కేంద్ర మంత్రి 35 కోట్లు రాయనపాడు రైల్వేస్టేషన్ అభివృద్ధి కి వినియోగించారు . 12 సంవత్సరాలు అత్యధిక కాలం ప్రధానిగా మోదీ ఉన్నారు. 12 ఏళ్లలో చేసిన అభివృద్ధి ప్రజలకు తెలియాలి . 65 ఏళ్ళు పాలించిన గత ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధి చేయలేదు . దేశంలో రైల్వే 100 శాతం విద్యుదీకరణ జరుగుతుంది. మన రైల్వే నెట్వర్క్ 1.05 లక్షల కిలోమీటర్లు. విద్యుదీకరణ జరగకపోతే లక్ష కోట్ల లీటర్ల డీజిల్ దిగుమతి చేసుకోవాలి . సూర్యుడు ముందు నుంచే ఉన్నాడు. సూర్యుని శక్తిని వినియోగించడం మోది తెలుసుకున్నారు. భవిష్యత్తులో చాలా చేయాల్సి ఉంది.. వికసిత భారత్ కూడా చేయాల్సి ఉంది . అమరావతిని ప్రధాని మోదీ నేతృత్వంలో రాజధానిగా నిర్ణయించి గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. దేశంలోని ప్రధాన నగరాలను కలుపుతూ అమరావతికి రైల్వే లైన్ వస్తుంది . 2026-27 10,144 కోట్లు ఏపీలో రైల్వేలో మౌళిక అభివృద్ధి కి ఇచ్చాం .ఏపీలో సీఎం చంద్రబాబు, పవన్ లతో కలిసి అభివృద్ధి దిశగా పనులు చేస్తున్నాం.

## వ్యవసాయానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక: సీఎం రేవంత్ రెడ్డి



- ♦ విత్తనం నుంచి కొనుగోలు వరకు పర్యవేక్షణ
- ♦ రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- ♦ ఏఐ, యాప్‌లతో వ్యవసాయ ఆధునీకరణ

హైదరాబాద్, జూన్ 16 : రైతులకు విత్తనాల సరఫరా నుంచి పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాకాలం, ఖరీఫ్ సీజన్ సన్నాహకాలపై ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన కీలక సూచనలు చేశారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేముల నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. పంటలు వేసిన దశ నుంచే రైతుల వివరాలు, పంటల విస్తీర్ణం, దిగుబడి అంచనాలు, కొనుగోళ్ల వరకు ప్రతి అంశంపై వ్యవసాయ శాఖకు పూర్తి సమాచారం పడకుండా వచ్చే సీజన్ నుంచే ధాన్యం కొనుగోళ్ల




## రాష్ట్ర పునర్నిర్మాణంలో కూటమి ప్రభుత్వం విజయవంతం

- రెండేళ్ల విజయోత్సవ సభలో మంత్రి అచ్చెన్నాయుడు
- సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తున్న ప్రభుత్వం
- పంటలపై దృష్టి పెట్టాలని సూచన

పార్వతీపురం, జూన్ 16 : కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్వహించిన

## సింగపూర్‌లో 'సీబీఎన్ ఏ 361 డిగ్రీస్' పుస్తకావిష్కరణ




2వ పేజీలో

- ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఆవిష్కరణ
- దార్శనిక నాయకత్వంపై విశ్లేషణాత్మక గ్రంథం
- అమరావతి విజన్, అభివృద్ధి నిర్ణయాలపై ప్రత్యేక ప్రస్తావన

సింగపూర్, జూన్ 16 : సింగపూర్‌లో కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'సీబీఎన్ ఏ 361 డిగ్రీస్... పాలీమ్యాథ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. రేపటి కోసం దినపత్రిక చీఫ్ ఎడిటర్

## లండన్ పార్లమెంట్‌లో గ్రీన్ ఇండియా ప్రతిధ్వని

2వ పేజీలో

- యూకే పార్లమెంట్ నుంచి మరో ఆహ్వానం
- క్లైమేట్ సదస్సులకు కో-హోస్ట్‌గా సంతోష్
- గ్రీన్ ఇండియాకు అంతర్జాతీయ గుర్తింపు

హైదరాబాద్, జూన్ 16 : పర్యావరణ పరిరక్షణ రంగంలో విశేష కృషి చేస్తున్న గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు,



## హోంమంత్రి అనితకు ఎమ్మెల్యే శ్రావణి మద్దతు

- దిగజారుడు వ్యాఖ్యలను ఖండించిన ఎమ్మెల్యే
- మహిళా నాయకత్వానికి అండగా ఉంటామన్న హామీ
- అనుచిత వ్యాఖ్యలకు ప్రజలే సమాధానం

అమరావతి, జూన్ 17 : రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై జరుగుతున్న విమర్శలు, అనుచిత వ్యాఖ్యలను ఎమ్మెల్యే బండారు



## గొర్రెల కాపరులకు న్యాయం చేయాలని బీసీ సంఘాల ధర్నా

- టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలి
- బాధితులపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్
- ఒంగోలు కలెక్టరేట్ ఎదుట నిరసన

2లో

ఒంగోలు, జూన్ 16: బాపట్ల జిల్లా చినగంజం మండలం కొత్త గొల్లపాలేనికి చెందిన గొర్రెల కాపరులపై జరిగిన దాడి ఘటనను నిరసిస్తూ వైఎస్సార్సీపీ నాయకులు, యాదవ సంఘాలు, బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు.



# ట్రంప్‌ను అర్థం చేసుకునేందుకు సైకాలజిస్టుల సాయం తీసుకున్న ఇరాన్?

(మొదటి పేజీ తర్వాత)

అనుసరించిన వ్యూహంపై ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలిని అర్థం చేసుకోవడానికి, ఆయన స్పందనలను ముందుగానే అంచనా వేయడానికి ఇరాన్ ఇద్దరు సీనియర్ సైకాలజిస్టుల సేవలను వినియోగించినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇరాన్ అధికార వర్గాల సమాచారం ప్రకారం, ట్రంప్ నిర్ణయాలు, స్పందనల్లో తరచూ కనిపించే అనూహ్య ధోరణులను దృష్టిలో ఉంచుకుని ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. శాంతి చర్చల ప్రక్రియలో పంపే సందేశాలు, ప్రతిపాదనలను మరింత సమర్థవంతంగా రూపొందించేందుకు సైకాలజీ నిపుణుల సలహాలు తీసుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా చర్చల సమయంలో అమెరికా అధ్యక్షుడి స్పందనలను అంచనా వేసి తదనుగుణంగా వ్యూహాలు రూపొందించేందుకు ఈ బృందం సహకరించినట్లు పేర్కొంటున్నారు. ఇరాన్‌కు చెందిన ఒక అధికారి మాట్లాడుతూ, చర్చల సలహాదారుల బృందంలో ఇద్దరు అనుభవజ్ఞులైన మానసిక నిపుణులను చేర్చామని తెలిపారు. వారి సూచనల ఆధారంగా ట్రంప్‌కు పంపే సందేశాలను రూపొందించామని, ఆ తర్వాత ఆయన స్పందనలో మార్పు కనిపించిందని పేర్కొన్నారు. చర్చల ప్రక్రియ మరింత సానుకూల దిశగా సాగడానికి ఈ విధానం ఉపయోగపడిందని ఆయన అభిప్రాయపడ్డారు.
ఏప్రిల్‌లో జరిగిన తొలి విడత చర్చల అనంతరం ఈ వ్యూహాన్ని అమలు చేయడం ప్రారంభించినట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో చర్చలకు సంబంధించిన మరిన్ని వివరాలు బయటకు వచ్చినప్పుడు తమ వ్యూహం ఎంత పకడ్బందీగా అమలైందో ప్రపంచానికి తెలుస్తుందని ఇరాన్ అధికారులు విశ్వాసం వ్యక్తం చేసినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఇదిలా ఉండగా, ట్రంప్ ప్రవర్తనపై అమెరికాలో కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఎస్ఐఆర్‌పై బీఎల్ఏలకు అవగాహన శిక్షణ

(మొదటి పేజీ తర్వాత)

అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, అర్హులైన ఓటర్ల నమోదు, డూప్లికేట్ పేర్ల తొలగింపు, వివరాల సవరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఓటరు జాబితాను సమగ్రంగా పరిశీలించి ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి సహకరించాలని బీఎల్ఏలకు సూచించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ ఎన్నికల వ్యవస్థలో అత్యంత కీలకమైందని అన్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడటం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఓటరు హక్కుల పరిరక్షణలో బీఎల్ఏల పాత్ర కీలకమని అన్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న లోపాలను గుర్తించి సకాలంలో సరిదిద్దేలా పార్టీ శ్రేణులు చొరవ చూపాలని పిలుపునిచ్చారు. శిక్షణ శిబిరంలో పాల్గొన్న నాయకులు ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై పలు విలువైన సూచనలు చేశారు. ప్రజల్లో అవగాహన పెంచి అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు సురేష్ షెట్కర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి, టీఎస్ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తూర్పు జయప్రకాశ్ రెడ్డి (జగ్గారెడ్డి), పటాన్‌చెరు కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, నీలం మధు ముదిరాజ్, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సింగపూర్‌లో 'సీబీఎన్ ఏ 361 డిగ్రీస్' పుస్తకావిష్కరణ

(మొదటి పేజీ తర్వాత)

ఐఏఎస్ అధికారి కేవీ సత్యనారాయణ ఆంగ్లంలో అనువదించారు. ఈ కార్యక్రమానికి ప్రవాస భారతీయులు, వివిధ రంగాల ప్రముఖులు, సింగపూర్‌లోని తెలుగు సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చంద్రబాబు నాయుడు రాజకీయ, పరిపాలనా ప్రయాణాన్ని వివిధ కోణాల్లో విశ్లేషిస్తూ ఈ గ్రంథాన్ని రచించినట్లు రచయిత వివరించారు. ముఖ్యంగా రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన తీసుకున్న కీలక నిర్ణయాలు, సాంకేతికత వినియోగం, పరిపాలనలో తీసుకొచ్చిన సంస్కరణలు, భవిష్యత్ అవసరాలను ముందుగానే గుర్తించి రూపొందించిన అభివృద్ధి ప్రణాళికలను ఈ పుస్తకంలో సమగ్రంగా పొందుపరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత నాయకులు, సింగపూర్ మాజీ ప్రధాని లీ క్వాన్ యూ, న్యూజిలాండ్ మాజీ ప్రధాని జెసిందా ఆర్డెర్న్‌ల తరహాలోనే చంద్రబాబు నాయుడు కూడా దూరదృష్టితో నిర్ణయాలు తీసుకుంటారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఆయన పనిచేస్తున్నారని, ముఖ్యంగా అమరావతి రాజధాని నిర్మాణంపై చూపుతున్న చొరవ, విజన్‌కు ఈ పుస్తకం అద్దం పడుతుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణ, డిజిటల్ పరిపాలన, మౌలిక వసతుల అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై చంద్రబాబు చేపట్టిన కార్యక్రమాలను పుస్తకంలో విశ్లేషించినట్లు తెలిపారు. ఆయన నిర్ణయాల వెనుక ఉన్న ఆలోచన విధానం, వ్యూహాత్మక ప్రణాళికలు, అమలు తీరును వివరిస్తూ ఈ గ్రంథాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. ఏపీ రెరా మాజీ చైర్మన్ రామనాథ్ వివిధ సందర్భాల్లో వ్యక్తం చేసిన అభిప్రాయాలను కూడా పుస్తకంలో పొందుపరిచినట్లు కార్యక్రమంలో వెల్లడించారు. సాధారణ ప్రజలకు, రాజకీయ విశ్లేషకులకు, పరిపాలనపై ఆసక్తి ఉన్న వారికి ఉపయోగపడే పలు ఆసక్తికర అంశాలు ఇందులో ఉన్నాయని చెప్పారు. బాహ్య ప్రపంచానికి పెద్దగా తెలియని కొన్ని కీలక విషయాలను కూడా పుస్తకంలో వివరించినట్లు తెలిపారు. పుస్తకావిష్కరణ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రచయిత శాఖమూరు శ్రీనివాస ప్రసాద్, అనువాదకుడు కేవీ సత్యనారాయణలను అభినందించారు. సమాజానికి ఉపయోగపడే, నాయకత్వ లక్షణాలను పరిచయం చేసే ఇటువంటి పుస్తకాలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. జ్ఞానం, అనుభవాలను భావితరాలకు అందించడంలో రచయితల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

# రాష్ట్ర పునర్నిర్మాణంలో కూటమి ప్రభుత్వం విజయవంతం

(మొదటి పేజీ తర్వాత)

విజయోత్సవ సభలో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, ఎన్డీయే కూటమి నాయకులతో కలిసి సభలో పాల్గొన్న ఆయన రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రభుత్వ పనితీరును వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 2024 జూన్ 12న కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించే నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉందన్నారు. భారీ అప్పులు, ఆర్థిక అవ్యవస్థ కారణంగా రాష్ట్రం తీవ్ర సంక్షోభంలో చిక్కుకుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాటలోకి తీసుకువచ్చామని తెలిపారు. గత రెండేళ్లలోనే రాష్ట్రానికి రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా 'తల్లికి వందనం' పథకం ద్వారా ఒకే రోజున రూ.10 వేల కోట్లను తల్లుల ఖాతాల్లో జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి చెప్పారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ పథకం వర్తింపజేస్తూ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని తెలిపారు. విద్యారంగంలో ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా గిరిజన ప్రాంతమైన పార్వతీపురం మన్యం జిల్లా వరుసగా రెండేళ్లు పదో తరగతి ఉత్తీర్ణతలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని అచ్చెన్నాయుడు చెప్పారు. తోటపల్లి, వంశధార, మడ్డువలస వంటి ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు రూ.2,500 కోట్లు కేటాయించామని, వచ్చే రెండేళ్లలో వాటిని పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి వంటి పథకాల ద్వారా ప్రతి వర్గానికి మేలు జరుగుతోందన్నారు. మన్యం ప్రాంతంలో రహదారుల అభివృద్ధితో ప్రజల రాకపోకలు సులభతరమయ్యాయని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంపై మాట్లాడిన మంత్రి, రైతులు కేవలం వరి పంటపైనే ఆధారపడకుండా పామాయిల్, కొబ్బరి వంటి లాభసాటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. పామాయిల్ సాగుకు ప్రభుత్వం మొక్కలు, నీటి సదుపాయం, విద్యుత్, డ్రిప్ వ్యవస్థలను ఉచితంగా అందిస్తోందని చెప్పారు. రైతులకు యూరియా, ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టామని, ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉపాధి, విద్యారంగాల్లో ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రస్తావిస్తూ, గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియను మంత్రి నారా లోకేష్ సమర్థవంతంగా పూర్తి చేశారని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఎలాంటి అవినీతి లేకుండా కంప్యూటరైజ్డ్ విధానంలో 16,700 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని తెలిపారు.

# లండన్ పార్లమెంట్‌లో గ్రీన్ ఇండియా ప్రతిధ్వని

(మొదటి పేజీ తర్వాత)

రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్‌కు యునైటెడ్ కింగ్‌డమ్ పార్లమెంట్ నుంచి మరోసారి ప్రత్యేక ఆహ్వానం అందింది. లండన్ క్లైమేట్ యాక్షన్ వీక్--2026లో భాగంగా నిర్వహించే పలు అంతర్జాతీయ కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. జూన్ 23న లండన్‌లోని హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో నిర్వహించే "ప్లేయింగ్ ఫర్ ది ప్లానెట్" పార్లమెంటరీ సదస్సుకు సంతోష్ కుమార్ కో-హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావం, సుస్థిర అభివృద్ధి అంశాలపై ఈ సదస్సులో చర్చలు జరగనున్నాయి. అనంతరం జూన్ 24న జరిగే క్లైమేట్ అండ్ సస్టైనబిలిటీ లీడర్‌షిప్ ఫోరమ్‌లో సంతోష్ కుమార్ కీలక ప్రసంగం చేయనున్నారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ ద్వారా చేపట్టిన పర్యావరణ కార్యక్రమాలు, ప్రజల భాగస్వామ్యంతో సాధించిన ఫలితాలను అంతర్జాతీయ వేదికపై వివరించనున్నారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ గ్రీన్ ఇండియా చాలెంజ్ ద్వారా ఇప్పటివరకు 19.6 కోట్ల మొక్కలను నాటినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 4.4 కోట్ల మంది ప్రజలు ఈ ఉద్యమంలో భాగస్వాములై, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజా భాగస్వామ్య పర్యావరణ ఉద్యమంగా గ్రీన్ ఇండియా చాలెంజ్ గుర్తింపు పొందిందన్నారు. అదేవిధంగా 33 దేశాల్లో 21 వేలకుపైగా మినీ జలాశయాల నిర్మాణం, వేలాది చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రకృతి పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంత ముఖ్యమో ప్రపంచానికి చాటిచెప్పడంలో ఈ కార్యక్రమాలు కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. కమ్యూనిటీ ఆధారిత పర్యావరణ ఉద్యమాలకు అంతర్జాతీయ వేదికలపై లభిస్తున్న ఆదరణ గ్రీన్ ఇండియా చాలెంజ్‌కు గర్వకారణమని సంతోష్ కుమార్ అన్నారు. పర్యావరణ పరిరక్షణను ప్రజల జీవన విధానంలో భాగంగా మార్చడమే తమ లక్ష్యమని, భవిష్యత్ తరాలకు హరిత భూమిని అందించేందుకు మరింత కృషి కొనసాగిస్తామని తెలిపారు.

# పరీక్షల అక్రమాలపై కేంద్రాన్ని నిలదీసిన ఖర్గే

(మొదటి పేజీ తర్వాత)

ప్రభుత్వాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. పేపర్ లీకేజీలు, పరీక్షలలో అవకతవకలు వెలుగుచూస్తున్నప్పటికీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడం విచారకరమని అన్నారు. జవాబుదారీతనం విషయంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జూన్ 21న నిర్వహించనున్న నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్‌కు ముందు టెలిగ్రామ్ మెసేజింగ్ యాప్‌పై కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక ఆంక్షలు విధించడాన్ని ఖర్గే తప్పుబట్టారు. టెలిగ్రామ్‌ను బ్లాక్ చేయడం ద్వారా సమస్య పరిష్కారం కాదని, కోట్లాది మంది యువత భవిష్యత్తును దెబ్బతీసిన వ్యవస్థ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా సుమారు 90 పేపర్ లీకేజీ ఘటనలు చోటుచేసుకున్నాయని ఖర్గే ఆరోపించారు. ఈ ఘటనల కారణంగా దాదాపు 9 కోట్ల మంది యువత తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. పేపర్ లీక్ మాఫియాను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, చిన్న స్థాయి నిందితులను మాత్రమే పట్టుకొని అసలు బాధ్యులను రక్షించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. పరీక్షల అక్రమాల కారణంగా అనేక మంది విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నారని, కొందరు ప్రాణాలు కూడా కోల్పోయారని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. నీట్, యూజీసీ-నెట్, ఎస్ఎస్‌సీ, సీయూఈటీ వంటి కీలక పరీక్షల్లో వరుసగా వెలుగుచూసిన అక్రమాలు యువతలో ఆందోళన పెంచాయని అన్నారు. పిల్లల విద్య కోసం అప్పులు చేసి సిద్ధం చేసిన తల్లిదండ్రులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల సీబీఎస్ఈ ఫలితాలపై కూడా అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయని, దేశంలో అత్యంత విశ్వసనీయంగా భావించే యూపీఎస్సీ పరీక్ష కూడా వివాదాల పరిధిలోకి రావడం ఆందోళన కలిగించే అంశమని ఖర్గే వ్యాఖ్యానించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విశ్వసనీయతను పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# వ్యవసాయానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక: సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తర్వాత)

సాఫీగా జరిగేలా వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో ప్రత్యేక ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కమిటీలో వ్యవసాయ శాఖ డైరెక్టర్, పౌర సరఫరాల సంస్థ ఎండీ, ప్రణాళికా విభాగం కార్యదర్శి సభ్యులుగా ఉంటారని తెలిపారు. విత్తనాల పంపిణీ, రైతుల నమోదు, పంటల రికార్డులు, ఉత్పత్తి అంచనాలు, ధాన్యం కొనుగోళ్ల వరకు అన్ని దశలను కమిటీ పర్యవేక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిశీలనతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రతి గ్రామంలో ఏ రైతు ఏ పంట సాగు చేస్తున్నాడనే సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని పేర్కొన్నారు. సన్న వడ్లు పండించే రైతులకు ప్రభుత్వం బోనస్ ఇస్తున్నందున ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను సబ్సిడీపై అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతు వేదికల్లోనే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సన్న వడ్లు సాగు చేసే రైతుల పూర్తి డేటా సేకరించాలని సూచించారు. రైతు వేదికలను రైతులకు ఉపయోగపడే సేవా కేంద్రాలుగా తీర్చిదిద్దాలని, అక్కడే రైతులు తమ వివరాలు నమోదు చేసుకొని విత్తనాలు, ఎరువులు పొందేలా వ్యవస్థను అభివృద్ధి చేయాలని చెప్పారు. వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగాన్ని ప్రోత్సహించాలని సీఎం సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో అమలు చేస్తున్న ఏఐ పైలట్ ప్రాజెక్టు ఫలితాలను అధ్యయనం చేసి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని పేర్కొన్నారు. సాఫీగా జరిగేలా వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో ప్రత్యేక ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కమిటీలో వ్యవసాయ శాఖ డైరెక్టర్, పౌర సరఫరాల సంస్థ ఎండీ, ప్రణాళికా విభాగం కార్యదర్శి సభ్యులుగా ఉంటారని తెలిపారు.

# హోంమంత్రి అనితకు ఎమ్మెల్యే శ్రావణి మద్దతు

(మొదటి పేజీ తర్వాత)

శ్రావణి శ్రీ తీవ్రంగా ఖండించారు. హోంమంత్రి అనిత ధైర్యం, పట్టుదల రాష్ట్రంలోని మహిళలకు ఆదర్శమని పేర్కొన్నారు. ఒక ఎస్సీ వర్గానికి చెందిన మహిళగా స్వశక్తితో ఎదిగి, విద్యా రంగంలో ప్రతిభ కనబరిచి, క్రమశిక్షణతో రాష్ట్ర హోంమంత్రి స్థాయికి చేరుకోవడం గొప్ప విషయమని ఎమ్మెల్యే అన్నారు. అనిత సాధించిన విజయాలు మహిళా సాధికారతకు నిదర్శనమని పేర్కొన్నారు. కొంతమంది వ్యక్తులు రాజకీయ ప్రయోజనాల కోసం హోంమంత్రి వ్యక్తిత్వాన్ని దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దిగజారుడు వ్యాఖ్యలతో ఆమె స్థైర్యాన్ని దెబ్బతీయాలన్న ప్రయత్నాలు ఫలించవని స్పష్టం చేశారు. హోంమంత్రి అనితకు ప్రజల ఆశీస్సులు, పార్టీ శ్రేణుల మద్దతు పుష్కలంగా ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఎలాంటి విమర్శలనైనా ధైర్యంగా ఎదుర్కొనే సత్తా ఆమెకు ఉందని పేర్కొన్నారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమాజం ఆమోదించదని, అలాంటి వారిని ప్రజలే తగిన రీతిలో గుణపాఠం చెబుతారని అన్నారు. మహిళా గౌరవాన్ని కించపరిచే చర్యలను ఖండించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. హోంమంత్రి అనితకు తమ సంపూర్ణ మద్దతు కొనసాగుతుందని, మహిళా నాయకత్వాన్ని బలోపేతం చేసే దిశగా ముందుకు సాగుతామని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ స్పష్టం చేశారు.

# విశాఖ ఉక్కు కర్మాగారంలో ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తర్వాత)

బాధితులకు న్యాయం చేయాలని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్, 139 బీసీ కులాల సంఘాల చైర్మన్ శ్రీనివాసులు, అఖిల భారత యాదవ మహాసభ నేతల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసనలో పెద్ద సంఖ్యలో యాదవులు, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొత్త గొల్లపాలేనికి చెందిన గొర్రెల కాపరులు పొలాల్లో గొర్రెలు మేపుతున్న సమయంలో టీడీపీ నేతలు వారిపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. కులం పేరుతో దూషించడంతో పాటు వారిని స్థానిక టీడీపీ కార్యాలయానికి తీసుకెళ్లి చిత్రహింసలకు గురి చేశారని పేర్కొన్నారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, వారికే న్యాయం చేయకుండా టీడీపీ నేతల ఒత్తిడితో పోలీసులు రివర్స్ కేసులు నమోదు చేశారని విమర్శించారు. ఈ చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, బాధిత గొర్రెల కాపరులపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ వర్గాలపై దాడులను సహించబోమని హెచ్చరించారు. బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి నిష్పక్షపాత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## చిలమత్తూరు ఎన్‌ఎచ్-44పై రోడ్డు ప్రమాదం, మహిళకు తీవ్ర గాయాలు





హిందూపురం (అనంత సూర్య ప్రతినిధి) : చిలమత్తూరు మండలం పరిధిలోని ఎన్‌ఎచ్-44 జాతీయ రహదారిపై మంగళవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కోడూరు నుంచి చిలమత్తూరు వైపు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న శ్రీరాములు--నాగమణి దంపతులను తెలంగాణకు చెందిన కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో నాగమణి తీవ్రంగా గాయపడగా, శ్రీరాములకు స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చర్యలు చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం..

## హిందూ స్మశాన వాటిక కోసం సీపీఎం పోరాటానికి ఫలితం -స్థల పరిశీలన చేసిన తహసీల్దార్

ముదిగుబ్బ (అనంత సూర్య ప్రతినిధి) : ముదిగుబ్బ మండలంలో హిందూ స్మశాన వాటిక ఏర్పాటు చేయాలంటూ సీపీఎం పార్టీ గత కొంతకాలంగా పలు దఫాలుగా ఆందోళనలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో సీపీఎం చేసిన పోరాటాలకు స్పందించిన ముదిగుబ్బ తహసీల్దార్ మహేశ్వర్ రెడ్డి మంగళవారం ముదిగుబ్బ బైపాస్ సమీపంలో స్మశాన వాటిక కోసం ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత భూమి వివరాలను అధికారులు పరిశీలించి, స్మశాన వాటిక ఏర్పాటుకు అనువైన పరిస్థితులపై అధ్యయనం చేశారు. స్థానిక ప్రజలకు అవసరమైన మౌలిక సదు-పాయాలను దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు చేపడతామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్వర్ రెడ్డి, సర్వేయర్లు, సీఐటీయూ మండల కార్యదర్శి బాబ్జాన్, కో-కన్వీనర్ టైలర్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు. హిందూ స్మశాన వాటిక ఏర్పాటు కోసం ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు.



## ముదిగుబ్బలో సీపీఎం సమావేశం ప్రజా సమస్యలపై తీర్మానాలు

ముదిగుబ్బ (అనంత సూర్య ప్రతినిధి) : ముదిగుబ్బలో మంగళవారం సీపీఎం శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించి ప్రజలపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించాలని నాయకులు డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఇంధన ధరల భారం సామాన్య ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ముదిగుబ్బలో హిందూ స్మశాన వాటికకు సంబంధించిన అంశాన్ని పారదర్శకంగా నిర్వహించి, ప్రజల అవసరాలకు అనుగుణంగా శాశ్వత పరిష్కారం చూపాలని సమావేశంలో చర్చించారు. స్మశాన వాటికకు సంబంధించిన భూకేటాయింపు, అభివృద్ధి పనులను అధికారులు వేగవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సీఐటీయూ కార్యదర్శి బాబ్జాన్, కో-కన్వీనర్ టైలర్ ముస్తఫా, పకీరప్ప, ముజఫర్, ఫక్రుద్దీన్, రిక్షా ముస్తఫా, రఫీ, అల్లాబక్ష్ తదితర నాయకులు పాల్గొన్నారు..



## బద్వేలు మైదుకూరు రోడ్డులో విషాదం మద్యం వ్యసనానికి ఒకరి బలి

బద్వేలు (అనంత సూర్య ప్రతినిధి) : స్థానిక మైదుకూరు రోడ్డులో ఎఒక విషాదకర ఘటన వెలుగుచూసింది. ఇక్కడి టీవీఎస్ షోరూమ్ సమీపంలో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు, అతను అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడిని పట్టణంలోని దూదేకుల వీధికి చెందిన రసూల్‌గా నిర్ధారించారు. స్థానికుల కథనం ప్రకారం గతంలోనే తల్లిదండ్రులు దూరమవడం, ఆ తర్వాత భార్య కూడా విడిచిపెట్టి వెళ్లడంతో రసూల్ తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. కాలక్రమేణా ఈ ఒంటరితనం, మానసిక ఒత్తిడి తట్టుకోలేక అతను మద్యపానానికి బానిసయ్యాడని, చివరకు అది అతని ప్రాణాలు కోల్పోవడానికి దారితీసిందని తెలుస్తోంది. ఈ సమాచారం అందుకున్న స్థానిక యంత్రాంగం ఘటనపై ప్రాథమిక విచారణ చేపట్టింది. పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.



## మాదిగ జాతి హక్కుల సాధనలో ముందున్న బండారు శంకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు



అనంతపురం (అనంత సూర్య) : పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సాగుతున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో మాదిగ జాతి హక్కుల సాధన కోసం విద్యార్థి దశ నుంచే అంకితభావంతో పనిచేస్తూ, ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తున్న యం.ఈ.ఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీ బండారు శంకర్ జన్మదినాన్ని పు-రస్కరించుకుని పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మాదిగ జాతి అభ్యున్నతి, సామాజిక న్యాయం, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న బండారు శంకర్, యం.ఈ.ఎఫ్ సంస్థను బలోపేతం చేస్తూ అనంతపురం జిల్లాలో ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు. ఉద్యమ లక్ష్యాల సాధనలో ఆయన చూపుతున్న నిబద్ధత యువతకు ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా యం.ఎస్.పి వర్కింగ్ ప్రెసిడెంట్, తాడిపత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ టి. ఆదినారాయణ మాదిగ మాట్లాడుతూ, బండారు శంకర్ మరిన్ని సంవత్సరాలు ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఆయన నాయకత్వంలో మాదిగ జాతి హక్కుల సాధనకు మరింత బలం చేకూరాలని కోరుతూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## రెండేళ్ల పాలన విజయగాథకు సాక్ష్యంగా జిల్లా స్థాయి మహాసభ

ముదిగుబ్బ (అనంత సూర్య ప్రతినిధి) : పుట్టపర్తిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కూటమి ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసిన రెండేళ్ల పాలనకు గుర్తుగా నిర్వహించిన జిల్లా స్థాయి "నమ్మకం -- అభివృద్ధి -- సంక్షేమం" మహాసభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ముదిగుబ్బ మండల ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ పాల్గొని ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు,



అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సేవలపై అధికారులు ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించి వివరాలు తెలియజేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన లక్ష్యంగా ముందుకు సాగుతోందని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల ఫలితాలను ప్రజలకు వివరించారు. ఈ




మహాసభలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఫీజుల దోపిడీపై డీఈఓ మౌనం వీడాలి ఏఐబీఎస్‌యూ

కడప (అనంత సూర్య ప్రతినిధి) : జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీ, పుస్తకాలు, యూనిఫాంల విక్రయాల అక్రమాలపై జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) స్పందించకుండా మౌనంగా ఉండటం పట్ల ఏఐబీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి జగన్ రాథోడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కడపలోని డీఈఓ కార్యాలయం ఎదుట ఏఐబీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పుస్తకాలు, యూనిఫాంలను చేతబట్టి నిరసన తెలుపుతూ విద్యాశాఖ అధికారుల తీరును ఖండించారు. ఈ సందర్భంగా జగన్ రాథోడ్ మాట్లాడుతూ, విద్యా సంవత్సరం ప్రారంభమైన వెంటనే జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. నారాయణ, శ్రీచైతన్య, బాష్యం, కేశవరెడ్డి, భీరం శ్రీధర్ రెడ్డి, ఎడిఫై, జీవన్ జ్యోతి తదితర విద్యాసంస్థలు ఒక్కో విద్యార్థి నుంచి ట్యూషన్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, రవాణా ఖర్చుల పేరిట లక్ష రూ-




పాయలకు పైగా వసూలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పా-ఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలు చేయరాదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటిని ఉల్లంఘిస్తూ కోట్ల రూపాయల వ్యాపారం సాగుతోందని ఆరోపించారు. ఈ విషయాలు తెలిసినా డీఈఓ చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. అదేవిధంగా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల ఆవరణల్లోనే హాస్టళ్లు నిర్వహిస్తున్న అనేక విద్యాసంస్థలపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే తనిఖీలు నిర్వహించి అక్రమాలకు పాల్పడుతున్న పాఠశాలలపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. కమలాపురం శ్రీ నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి, కమలాపురం పరిధిలోని శ్రీ నారాయణ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా హాస్టల్ నిర్వహిస్తున్నారని, విద్యార్థులపై మానసిక ఒత్తిడి తీసుకొస్తున్నారని జగన్ రాథోడ్ ఆరోపించారు. పాఠశాలలో జరుగుతున్న వ్యవహారాలపై విద్యాశాఖ అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి అవసరమైతే హాస్టల్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పుస్తకాలు, యూనిఫాంలను అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐబీఎస్‌యూ కడప నగర నాయకులు జోషఫ్, ఆదిత్య, విష్ణువర్ధన్, సంపత్, చిన్నరాయుడు, లోకేష్ రెడ్డి, విజయ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు తిరగబడితే ఎక్కడ ఉంటారో చూసుకోండి



అనంతపురం, జూన్ 16 అనంత సూర్య : మహిళల గురించి నీచంగా మాట్లాడుతున్న వైసీపీ నాయకులపై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఘాటుగా స్పందించారు. మహిళా మంత్రులు, ఎమ్మెల్యేల మీద వైసీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని.. ఒక్కసారి మహిళలు తిరగబడితే ఎక్కడుంటారో చూసుకోవాలని హెచ్చరించారు. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనపై నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆమె పాల్గొన్నారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను తిలకించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలతో మమేకమవుతూ ఆమె ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ రాష్ట్రంలో నరకాసుర పాలన ముగిసి రెండేళ్లవుతోందన్నారు. గత ఐదేళ్లలో ప్రజలు ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడ్డారని, రాష్ట్రం ఆర్థికంగా చితికిపోయిందని ఎమ్మెల్యే సునీత అన్నారు. చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయ్యాకనే రాష్ట్రం గాడిలో పడిందని... పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే సునీత అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తున్నారన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, స్త్రీ శక్తి పథకం వంటి వాటి గురించి ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత ప్రభుత్వంలో పార్టీలు చూసి సంక్షేమ పథకాలు అమలు చేశారని.. ఎంతోమంది అసలైన లబ్ధిదారులకు అన్యాయం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో పార్టీలు చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పథకాలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున సంక్షేమ, అభివృద్ధి విప్లవం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయని... మరి ముఖ్యంగా శ్రీ సత్యసాయి జిల్లాలో యుద్ధ విమానాలు తయారు చేసే పరిశ్రమ రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉన్న పరిశ్రమలు వెనక్కు వెళ్లిపోయాయన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో రాప్తాడులో జాకీ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తే వైసిపి వచ్చిన తర్వాత కమీషన్ల కోసం ఆ కంపెనీ హైదరాబాద్ వెళ్లిపోయేలా చేశారన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాగానే మళ్లీ అదే స్థానంలోనే రేమాండ్స్ పరిశ్రమ తీసుకువచ్చామన్నారు. మ-రోవైపు రాష్ట్రంలో మహిళల గురించి వైసిపి మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హోం మంత్రి అనిత పై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యల మీద తీవ్రంగా స్పందించారు. మహిళల వ్యక్తిగత విషయాల మీద మాట్లాడే హక్కు ఎవరిచ్చారని నిలదీశారు. మంత్రి సవిత విషయంలో కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేశా-రన్నారు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి కూడా మహిళల గురించి కించపరిచే విధంగా మాట్లాడుతున్నారన్నారు.. ఇలాంటి వారిపై మహిళలు తిరగబడితే ఏం జరుగుతుందో ఒకసారి ఆలోచించుకోవాలన్నారు. తాము చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలనుకోవడం లేదని పోలీసులు వారిపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రెండేళ్లలో జరిగిన అభివృద్ధి సంక్షేమాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ నిరసన కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే వారికి బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే సునీత పిలుపునిచ్చారు.



# కూటమి ప్రభుత్వ రెండేళ్ల సుపరిపాలన సంబరాలు ఘనంగా నిర్వహణ



ముదిగుబ్బ (అనంత సూర్య ప్రతినిధి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలో మంగళవారం సుపరిపాలన విజయోత్సవ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, పరిటాల స-ునీతమ్మ, పల్లె సింధూర రెడ్డి, ఎంఎస్ రాజు, హిందూపూర్ పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముదిగుబ్బ మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చినగాని నరసింహా యాదవ్, ములకవేముల గ్రామ కమిటీ అధ్యక్షుడు బండి మల్లికార్జున కూడా కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై తమ అభిప్రా-యాలను వెల్లడించారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి యన్. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో రాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేసిందన్నారు. రైతులు, మహిళలు, యువత, బీసీలు సహా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని, ప్రజలు ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా పాలన సాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమం విజయవంతం కావడంలో జిల్లా పార్టీ నాయకత్వం, కార్యకర్తల కృషి అభినందనీయమని నేతలు కొనియాడారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## సండ్ర చెట్లను ఎటువంటి అనుమతి లేకుండా తరలించరాదు తహశీల్దార్ లక్ష్మమ్మ.

ధర్మవరం, జూన్ 8 (అనంత సూర్య ప్రతినిధి) : చేనేత కార్మికులకు ప్రకటించిన 'నేతన్న భరోసా' పథకం కింద ప్రతి కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయాన్ని వెంటనే అందించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరింది. సోమవారం ధర్మవరంలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ నేతృత్వంలోని నాయకులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ధర్మవరంలో పవర్‌లూమ్‌ల నియంత్రణ కోసం తిరుపతిలో ఉన్న రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయాన్ని ధర్మవరానికి



మార్చాలని కోరారు. అదేవిధంగా చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ రద్దు, వర్షాకాల భృతి పునరుద్ధరణ, ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు.

# ప్రజాప్రతినిధులారా మా ఇండ్లను కొనండి, ఇక్కడ మేము జీవించలేము

- **పట్టణంలోని 35 వార్డుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం: సీపీఐ(ఎంఎల్)**

కడప (అనంత సూర్య ప్రతినిధి) : బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్) నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు బద్వేల్ పట్టణంలో చిల్డ్రన్స్ పార్క్, వాకింగ్ ట్రాక్ వంటి ప్రజావసర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం బద్వేల్ పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీపీఎస్ నిధులతో చేపట్టిన సుమారు రూ.3 కోట్ల విలువైన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. పట్టణ సుందరీకరణలో భాగంగా నాగల చెరువు చుట్టూ నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ పనులు మధ్యలో నిలిచిపోయాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సీమాంక ఆసుపత్రి వెనుక ఉన్న స్మశానవాటికలో ఆక్రమణలను తొలగించి, నాగల చెరువులో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై




చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్‌హెచ్-67 జాతీయ రహదారిపై నెల్లూరు రోడ్డులో స్మశానాల సమీపంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ గదుల కేటాయింపుల్లో పారదర్శకత పాటించి, నిజమైన అర్హులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భగత్‌సింగ్ నగర్, మార్తమ్మ నగర్, గౌరీశంకర్ నగర్, ఇన్సాఫ్ నగర్, వృక్షా కాలనీ, సుందరయ్య కాలనీ, ఐలమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఎన్వోసీ సమస్యలతో సంబంధం లేకుండా ప్రతి ఇంటికి విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని, పన్నులు చెల్లించని ఇండ్లకు ఇంటి పన్నులు విధించాలని మున్సిపల్ అధికారులను కోరారు. పట్టణ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వీధి కుక్కలు, పందుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పందుల పెంపకందారులకు డంపింగ్ యార్డు సమీపంలో స్థలాలు కేటాయించి, పట్టణ వీధుల్లో తిరుగుతున్న పందులను ఊరి బయటకు తరలించాలని సూచించారు. పట్టణంలోని 35 వార్డుల్లో తాగునీటి కొరత లేకుండా ప్రతిరోజూ నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు జకరయ్య, ఏరియా కమిటీ సభ్యులు విజయరావు, బాబు, నారాయణ, రామరాజు, జయరామరాజు, గంట మహబూబ్ బాషా, పట్టణ సమితి సభ్యులు చెన్నయ్య, ఈశ్వర్, రమణ, నరసింహ, దైవదినం, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## తప్పులు లేని ఓటరు జాబితా తయారీ లక్ష్యం – తహశీల్దార్ జె. లక్ష్మమ్మ.

నంబులపూలకుంట, జూన్ 16, **(అనంత సూర్య ప్రతినిధి)** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో భాగంగా నంబులపులకుంట మండలంలోని రెడ్డివారిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఇంటింటి ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని తహశీల్దార్ జె. లక్ష్మమ్మ క్షేత్రస్థాయిలో ప రి శీ లి ం చా ర ు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు (బి ఎల్ వోలు) నిర్వహిస్తున్న పనితీరును



సమీక్షించి, ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి పొరపాట్లు లేకుండా వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో నమోదు కావడంతో పాటు అనర్హుల పేర్లు తొలగించే విధంగా అత్యంత పగడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి బూత్ లెవల్ ఏజెంట్లు ((బి ఎల్ ఏ లు) మరియు బూత్ లెవల్ అధికారులు (బి ఎల్ వోలు ) పరస్పర సమన్వయంతో పనిచేసి, ఇంటింటి ఓటరు వెరిఫికేషన్ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తహశీల్దార్ జె. లక్ష్మమ్మ సూచించారు. తప్పులు లేని, పారదర్శకమైన మరియు విశ్వసనీయమైన ఓటరు జాబితా తయారీనే ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని, అందుకు సంబంధిత సిబ్బంది పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని పేర్కొన్నారు..

# తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ జాబితా సవరణపై శిక్షణ కార్యక్రమం



ఆమడగూరు (అనంత సూర్య ప్రతినిధి) : ఆమడగూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఓటర్ జాబితా సవరణపై బీఎల్‌ఓలకు అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల తహసీల్దార్ మారుతి ప్రకాష్, ఎంపీడీవో శకుంతలమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మారుతి ప్రకాష్ మాట్లాడుతూ, ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా 2002 ఓటర్ జాబితా ఆధారంగా అవసరమైన వివరాలను పరిశీలించి, మహిళలు మరియు పురుషులు తమ తల్లిదండ్రుల ఓటర్ వివరాలు, చిరునామా ఆధారాలను సమర్పించి ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తెలిపారు. వివాహిత మహిళలు తమ వివాహానికి ముందు ఉన్న ఓటర్ వివరాలు, తల్లిదండ్రుల ఓటర్ గుర్తింపు కార్డు ఆధారంగా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. 2026 ఓటర్ జాబితా సవరణలో భాగంగా బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి దరఖాస్తులను స్వీకరిస్తారని, ప్రజలు వారికి పూర్తి సహకారం అందించాలని కోరారు. ఓటు నమోదు కోసం దరఖాస్తు ఫారంతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సూపర్వైజర్లు, 26 మంది బీఎల్‌ఓలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## పుట్టపర్తిలో ఘనంగా కూటమి రెండేళ్ల పాలన సంబరాలు

- **పల్లె ఆదేశాలతో జగరాజుపల్లి నుంచి కదం తొక్కిన టిడిపి శ్రేణులు**

పుట్టపర్తి, జూన్ 16, **(అనంత సూర్య ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం సంబరాలు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆదేశాలతో పుట్టపర్తి మండలం జగరాజుపల్లి పంచాయతీ నుంచి టీడీపీ శ్రేణులు భారీగా



తరలివచ్చాయి. గ్రామ ఇన్‌చార్జి మురళీధర్ రెడ్డి, బూత్ కన్వీనర్ బాలు ఆధ్వర్యంలో దాదాపు 50 మంది కార్యకర్తలు 30 బైకులు, 2 ఆటోలతో ర్యాలీగా సభకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మురళీధర్ రెడ్డి, బాలు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అభివృద్ధి, సంక్షేమాన్ని ధ్యేయంగా పాలన సాగించిందని, ప్రజలకు అండగా నిలిచిందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కో-డైరెక్టర్ రామచంద్ర, టీడీపీ నాయకులు రామలింగప్ప, తలారి నారాయణ, గంగాద్రి, కుంటెన్న, రాజేంద్ర, పెద్ద భైరవుడు, రామాంజి, గోవిందు, వెంకటేష్, నరసింహ, చింతమాను సాయి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# అనంతపురం నగరంలో వర్షం నీరు నిలవడం గత వైసీపీ పాలకవర్గం పనితీరుకు నిదర్శనం -పోతుల లక్ష్మీనరసింహులు

అనంతపురం జూన్ 16 అనంత సూర్య న్యూస్ : గత ఐదు సంవత్సరాల వైసిపి పాలకవర్గం వేలకోట్ల రూపాయలు అభివృద్ధి చేశామని మాజీ మేయర్ వసీం మాటలు చెప్పడం, నేడు వర్షాల దాటికి నీరు నిండి వంకలు, చెరువులు తలపించడం గత వైసిపి పాలకవర్గ పనితీరుకు నిదర్శనమని ఏపీ పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు అన్నారు. మంగళవారం స్థానిక తెలుగుదేశం పార్టీ అర్బన్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో పోతుల లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ వైసీపీ నాయకుల మాటలు కోటలు దాటాయిగాని, వర్షపు నీరు మాత్రం ముందుకు సాగడం లేదని తేటతెల్లమ్ అయిందని వాపోయారు. చిన్న పాటి వర్షాలను ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోవడం చూస్తుంటే బాదేస్తోందని, అనంతపురం నగర ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మరువవంక, సూర్య నగర్ రోడ్డు, అశోక్ నగర్ తదితర ప్రాంతాలలో కూడికతీత పనులను వేగవంతం చేసి నీటిని సజావుగా ముందుకు సాగేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు. గత వైసిపి పాలనలో పూడికతీత పనులు చేపట్టక నీరు కాలనీలలోకి ప్రవేశించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడడం జరిగిందని, గత వైసిపి




పాలకవర్గం నిర్వాకం వల్లనే ఇదంతా జరిగిందని ప్రజలందరికీ అర్థమవుతుందని అన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. గత వైసిపి పాలనలో పేదవాడికి సెంటర్ స్థలం ఇంటి స్థలం ఇల్లు నిర్మించి ఇస్తామని జగనన్న కాలనీలు నిర్మిస్తామని గొప్పలు చెప్పి నేడు స్థలం ఇవ్వక, ఇల్లు నిర్మించక ప్రజలు సచివాలయాలతో తిరుగుతున్న ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న వైసీపీ పార్టీ నాయకుల తీరును చూసి ఆశ్చర్యానికి లోను కావడం జరుగుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వానికి రెండేళ్లు వెన్నుపోటుగా కార్యక్రమాలు చేపట్టడం చూసి ప్రజలు వెన్నుపోటు కాదు, వైసిపి గొడ్డలి పోటుకు ఏడు సంవత్సరాలు అవుతుందని, ప్రజలు సొంత చెల్లెలు సునీత తెలియజేయడం జరుగుతుందని అన్నారు. పారిశ్రామికవేత్తలకు భూమిని కేటాయిస్తుంటే ఓర్వలేని వైసీపీ నాయకులు వారి జిల్లా కార్యాలయాలకు ప్రభుత్వ స్థలాలను కేటాయించి కోటలు నిర్మించుకోవడం ఎంతవరకు సబబుఅని ప్రశ్నించారు. జిల్లా కార్యాలయాలకు నిర్మించడానికి ప్రభుత్వ ధనాన్ని కేటాయించారా? లేక వైసిపి నాయకుల సొంత డబ్బులను వెచ్చించారా? ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. బ్లీచింగ్ పౌడర్ కు బదులు పిండిని వాడిన పాలకులు వైసిపి పాలకులని, కుక్కలను కంట్రోల్ చేయలేని పాలకవర్గం వైసీపీ పాలకవర్గం అని వాపోయారు. ప్రజలు సత్యాలను నమ్ముతారని, అసత్యాలను గమనించి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. అబద్ధాలతో, మాయ మాటల గారడీతో బురిడీ కొట్టే రోజులు పోయాయని తెలిపారు.

## పుట్టపర్తిలో నేడు వడ్డెర జీవో-92పై అవగాహన సదస్సు

పుట్టపర్తి, జూన్ 16 **(అనంత సూర్య ప్రతినిధి)** వడ్డెర కులస్తుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నెం. 92పై అవగాహన కల్పించేందుకు బుధవారం పుట్టపర్తిలో ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పుట్టపర్తి గణేష్ సర్కిల్ సమీపంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్లో ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సదస్సులో మైనింగ్, ఇండస్ట్రీస్, బీసీ సంక్షేమ శాఖ, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం తదితర శాఖల అధికారులు పాల్గొని జీవో-92లోని ముఖ్యాంశాలు, వడ్డెర కులస్తులకు కలిగే ప్రయోజనాలపై వివరించనున్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని వడ్డెర సంఘాల నాయకులు, కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకుని ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు..

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405